# రాముడిపట్టం-భరతుడిరాజ్యం

ఏమిటో విశేషం - ఇది వరలో ఎప్పుడూ కనీ వినీ ఎరుగని కానుకలు పంపించారు దశరథమహారాజు. అవన్నీ చూసుకుంటూ తాను రాణులందరిలోకీ ముద్దుల భార్యననీ, ప్రియురాలిననీ మురిసి పోతూన్నది కైకేయి. చీనిచీనాంబరాలేకాదు, ముత్యాల పేరులే కాదు, రత్నాలహారాలేకాదు, స్రక్చందనానులేపనాలే కాదు, అగరు జవ్వాజి కస్తూరి గోరోచనం ఘుమఘుమలే కాదు - ఆ వస్తు సామగ్రిని చూసి కళ్ళు మెరిసిపోతున్నాయి కైకకు. ఒక్కొక్కటీ తాకి చూసిందామె. సరిగంచు జరీ బుటేదారి రవసెల్లాలు తన ఒంటిమీద ఎలా ఎలా ఉంటాయో, అమరుతాయో విలాసంగా సుతారంగా నిలువుటద్దాల ముందు నిలచి చూసుకుంటున్నది కైక.

"ఇదుగో విన్నావుటమ్మా కైకమ్మతల్లీ, నష్టజాతకురాలా" అని పెద్దగా గొణుక్కుంటూ చిడిముడిపడుతూ విసవిసలాడుతూ రుసరుస లాడుతూ గంగిరెద్దులా గూని ఊపుకుంటూ బుడి బుడి యేడుపులు ప్రయత్నంమీద మింగుకుంటూ అంతఃపుర కక్ష్యాంతరాలు దాటి వచ్చి పడింది మంథర.

"ఏమైందే నీకు ముసలిదానా! తుమ్మల్లో పొద్దులా ఎందుకంత ముఖం ముటముట లాడించుకుంటావు!" అన్నది కైక నవ్వు నాపు కుంటూ; ఈ తన మహాభాగ్యమంతా - చూశావుటే-అని కనుబొమలు విలాసంగా ఆకుంచితాలు చేస్తూ.

'సదేసంబడం!' అన్నట్లుగా మూతి విరిచింది మంథర. "ఇక నీ భోగభాగ్యాలు చెల్లిపోతున్నాయి. నీ అదృష్టపు రోజులు అయిపోయి నట్టే సుమీ" అన్నది సాగదీసుకుంటూ.

ఛర్రున కోపం వచ్చింది కైకేయికి.

"ఇప్పుడు నీకేం పోయే కాలం వచ్చిందే" అని కస్సుమన్నది.

"అవివేకంతో కళ్ళు మూసుకొని పోయినవాళ్ళకు ఎవరూ ఏమీ చెప్పలేరమ్మా. ఎంత తెంపుదామనుకున్నా పసితనం నుంచీ పెంచిన మమకారం ఒకంతట తెంపుకో లేకుండా ఉన్నానమ్మా."

"ఇంతకీ ఇప్పుడు నీ కొచ్చిన రోగమేమిటో చెప్పావుకావు" అన్నది కైక నిష్ఠురంగా.

"నీకు కాస్తయినా ముందు చూపు, లోకజ్ఞానం ఉంటే నేనింత అడిలిచావాల్సి వచ్చేదే కాదు."

"అసలింతకూ ఏమిటో చెపుతావా, చెప్పవా?"

"ఊరూ వాడా ఏకమై చెప్పుకుంటూ ఉంటే నీ కింతవరకు తెలియదంటేనే ఏదో పెద్ద కుట్ర ఉన్నదన్నమాటే కదా తల్లీ! ఏదో పెద్ద కూహకం జరుగుతున్నట్లేగా! గోతులు తవ్వుతున్నట్లేగా! నాటకం ఆడుతున్నట్లేగా!"

"మందరా,ఇపుడు నేనెంతో ఆనందంగా ఉన్నాను. ఉత్సాహంగా సంతోషంగా ఉన్నాను. నన్నెందుకిలా వేధిస్తావు? అదేవిటో వెంటనే చెప్పరాదా? నీ కేవిటిప్పుడు కష్టం వచ్చింది! ఈ రాజ్యంలో నిన్ను కాదని బతికే దెవరు? వెంటనే చెప్పేసెయ్! లేదూ, నేను శయన మందిరానికి వెళ్ళి తలుపుగడియపెట్టి ఈ తలనొప్పి భరిస్తూ పడుకుంటాను."

"అదే నమ్మా తల్లీ! నేనూ చెప్పేది! ఇక ఇక్ష్వాకు చక్రవర్తి తల్లి ఆ కౌసల్యాదేవి కాబోతున్నది. భాగ్యమంటే ఆమెదే భాగ్యం. సిరి అంటే ఆమెదే సిరి. చిన్నెలంటే ఆమెవే చిన్నెలు."

"ఏవిటేవిటీ?!"

"అలా ఉలికిపడతావేం రాణీ? అట్లా దారిలోకిరానీ నీ బుద్ధిని."

"చెప్పమరి!"

"రాముడికి యువరాజపట్టాభిషేకం జరగబోతున్నదే తెలివి తక్కువరాణీ! తెల్లవారితే పుష్యమీనక్షత్రశుభలగ్నాన పట్టాభిషేకమని అయోధ్య అంతా కోడై కూస్తోంది. నువ్వు ఒక్కసారి బయటకువచ్చి చూడు, అయోధ్య అంతా ఎంత కన్నుల పండువుగా ఉందో! ఇంత ఉత్సవం, ఇంత కోలాహలం, ఇంత అందం నీవెంట వచ్చి ఇక్కడ అడుగుపెట్టిననాటినుంచీ నేను చూడనేలేదు."

"ఓసి ఓసి మంధరా! ఎంత చల్లనివార్త తెచ్చావే. ఎంత కమ్మని కబురు చెప్పావే! నా తండ్రి శ్రీరామచంద్రుడికి పట్టాభిషేకమా! ఓసి మంధరా! నీవు నూరేళ్ళు బతుకు, వెయ్యేళ్ళు చల్లగా వర్థిల్లు. ఎంత సంతోషకరమైన వార్త చెప్పావే! నా ముద్దుల కొడుకు రామచంద్రుడే! నాకు భరతుడి కన్నా రాముడే ప్రాణం. నా తండ్రి రామయ్య అందరి కన్నా ముందుగా నాకు చెప్పవలసినవాడు కదా! వ్రతస్నాతుడై పూజా పురస్కారాలలో ఉన్నాడేమో! అనుకోకుండా ఇవాళే ఈ ఆలోచనచేసి ఉంటారు మహారాజు. ఏది ఏమైతేనేం, ఇట్లా రావే గూనిదానా! నా జీవితంలో ఇంతకన్నా ఆనందకరమైన వార్త ఏముంటుంది?" అని తానే మంధర దగ్గరకు వచ్చి తన మెడలోని మంచి ముత్యాలహారం తీసి స్వయంగా మంధర మెడలో వేసింది కైక. "ఈ శుభవార్త చెప్పినందుకు ఇప్పటికిది నీకు చిన్న బహుమానం" అన్నది.

కల్లుతాగి నిప్పుతొక్కిన కోతి చిందులు తొక్కినట్లు మంధర ఆవేశంతో కోపంతో అసహ్యంతో చిరాకుతో చీదరతో ఆ ముత్యాల దండ తెగిపోయేలా తన మెడలోంచి పుటుక్కున లాగి కిచకిచలాడుతున్న ధ్వనులు చేస్తూ రెండు మూడు ముత్యాలు నోటితో కొరికి అవతలకు విసరివేసింది ఆ దండను.

కైక ముఖం జేవురించింది. "ఏమిటే నీ ఆగడం దుష్టురాలా!" అని తీవ్రంగా కోపగించుకుంది.

అప్పుడిక నెమ్మదిగా దగ్గరకు వచ్చి కైకమ్మగడ్డం పుచ్చుకొని చెంపలపై మెటికలు విరిచి కళ్లూ ముక్కూ ముఖమూ నోరూ మూదింతలు నాలిగింతలు చేసుకుంటూ గవదలు నొక్కుకుంటూ పథకం ప్రారంభించింది మంథర. మాయ పాచికలు విసిరింది ఒడుపుగా.

"తల్లీ, నాదేముంది. ముసలిముండను. బతికి నన్నాళ్ళు బతకబోను. నిన్ను ఇంత పసికందుగా గుండెలమీద పెంచుకుంటూ వచ్చాను కాబట్టి ఈ నా తాపత్రయం. నేను చెప్పిన మాటలన్నీ సావధానంగా విని తర్వాత నీ ఇష్టం వచ్చినట్లు ఆలోచించుకో. నడుచుకో. వయసు బాగా తేడా ఉన్న దశరథమహారాజుగారికి నిన్ను ఇవ్వటానికి మీనాన్న కేకయ మహారాజుగారెంత బాధపడ్డారో, నేనెంత విలవిలలాడానో నీకు తెలియదు. ఇద్దరు రాణులకూ సంతానంలేదనీ సంతానంకోసమే మళ్ళీ ఇప్పుడు తాను పెళ్ళాడుతున్నాననీ ఆయన - ఆ దశరథ మహారాజు వచ్చి ప్రాధేయపడినప్పుడు మేమెంతగానో బాధపడ్డాం. ఆ బాధను ఎవరితో చెప్పుకోగలం?"

"అవునే, నాకు తెలుసులేవే ముసలిదానా! నాకు కొడుకు పుడితే నా కొడుక్కే పట్టాభిషేకం చేస్తానని ఆయన వాగ్దానం చేశాడు. అంతే కదూ నువ్వనేది? అందులో వింతేముంది? పుడితే ఇక నాకు మాత్రమే కొడుకు పుట్టాలి అని మహారాజు అప్పుడనుకున్నాడు. మరి తక్కిన రాణులకంతవరకు సంతాన ప్రాప్తి లేదుకదా! ఆ తరువాత చాలాకాలం నాకు కూడా సంతాన ప్రాప్తి లేకపోయింది కదా! ఆ తర్వాత జరిగిన సంగతులన్నీ నీకు తెలియనివి కావు. అయినా ఇప్పుడింతకూ నువ్వేమంటావు?" అని విసుక్కుంటూనే అడిగింది కైకేయి.

"అమ్మా, నువ్వు కోపగించుకోనంటే ఒక మాట చెప్పాలి. ఇంత హఠాత్తుగా రహస్యంగా ఈ ఏర్పాట్లన్నీ ఎందుకు జరిగాయో నీకు తెలీటం లేదు. అయోధ్యలో ఈ సంగతి ఇప్పటివరకు నీకూ నాకూ తప్ప అందరికీ తెలిసింది. చివరకు నీ ఒక్కదానివే మిగిలిపోయినావు. నేను చెప్పినదాకా కూడా నీకు తెలీలేదు.

"అంతేకాదు. ఇక్ష్వాకురాజ్యాన్ని శుల్కంగాచేసి దశరథ మహారాజు నిన్ను పెళ్ళాడాడు. తన దౌహిత్రుడికే రాజ్యం వచ్చే ఒప్పందం మీదే మీ నాయన గారు దశరథ మహారాజుకి నిన్నిచ్చి పెళ్ళి చేశారు. అది నీకూ తెలుసు. మహారాజుకీ తెలుసు. భరతుడు అయోధ్యలో లేకుండా ఈ మిడసరిలగ్గం ఎందుకు పెట్టవలసి వచ్చింది? ఆ ఒప్పందం తప్పించటానికే కదా! ఖరారు గంగలో కలపటానికేకదా! రేపు పట్టాభిషేకం జరుగుతున్నదనగా ఇంతవరకూ నీకు తెలియకుండా ఉంచటం దేనికి? పోనీ, రాచకార్యాల్లో మహారాజుకు తీరిక లేదనే అనుకుందాం. ఆ సీతమ్మో, సుమిత్రమ్మో, కౌసల్యమ్మో వచ్చి నీ చెవిని వేశారా? నా రామచంద్రుడు, నా రామచంద్రుడు అని నువ్వేమో పొంగిబోర్లగిల పడతావు! వాళ్ళకెవరికీ నీమీదలేని ఆపేక్ష నీ ఒక్కరికేనా? ఎందుకు? ఇందులో చాలా పెద్దకుట్ర ఉంది. రాముడికి రాజ్యం కట్టపెట్టేసి ఇక నిన్ను దిక్కులేనిదాన్ని చేయటమే ఈ కుట్రకంతా మూలం."

"ఓసి మందరా! నీవనుకుంటున్నట్లు ఒక్కనాటికీ జరగదు. రాముడు సుగుణాభిరాముడు. నయనాభిరాముడు. అయోధ్యకంతకూ అతడే ప్రాణం. చల్లనయ్య, నీకు తెలుసోతెలీదో తమ్ములంటే రాముడికి దశరథ మహారాజుకన్నాకూడా ఎక్కువ ప్రేమ. తండ్రికంటే కూడా తమ్ములమీద పంచప్రాణాలు రాముడికి. ఇంతకూ ఇప్పుడు నువ్వు చెపుతున్న మాటలనుబట్టి రాముడికి యువరాజ పట్టాభిషేకం జరుగుతున్నది. జరగనీ. రాజుగారు పెద్దవాడనై పోయాననీ ఇదివరకటిలా బాగా ఉత్సాహం ఉండటంలేదనీ వోపిక ఉండటంలేదనీ అంటు

న్నారు ఈమధ్య. అందువల్ల రాజ్యపాలనలో తనకు సాయంగా రామచంద్రుడికి యువరాజ్య పట్టాభిషేకం సంకల్పించి ఉంటారు. ఇవాళ కాకపోతే ఇక నూరేళ్ళకైనా రాముడే భరతుడికి పట్టాభిషేకం చేస్తాడు. దశరథ మహారాజు నన్ను పెళ్ళి చేసుకొనేటప్పుడు నా కొడుక్కి రాజ్యం ఇస్తానన్నాడని రాముడికిదివరకే తెలిసి ఉంటుంది. తెలియదూ, నేను చెపుతాను. నా మాట ఎప్పుడూ కాదనడు రాముడు. కాబట్టి దశరథుడు పట్టం కట్టకపోయినా రాముడు తన తమ్ముణ్ణి రాజును చేస్తాడు."

వికటంగా నవ్వింది మంథర. "లోకంలో ఎక్కడైనా పడుచు పెళ్ళాం వయసు మీరిన మగణ్ణి చెప్పు చేతలతో ఉంచుకుంటుంది. స్వాధీనంలో ఉంచుకుంటుంది. కాని, నీ విషయంలో అంతా వ్యతిరేకమే జరిగింది. ఏం మాయలు, మంత్రాలు నీ సవతులు పన్నారో కాని, మీ ఆయన నీకు ఏ మందులు మాకులూ ప్రయోగించాడో కాని నీ బుద్ధి అంతా పూర్తిగా పనికిరాకుండా పోయింది. లేకపోతే కౌసల్యకు చెప్పిన రాజు నీతో కూడా చెప్పవచ్చునుకదా రాముణ్ణి యువరాజును చేస్తున్నానని. చెప్పలేదంటే కారణం ఏమిటి? ఆకాస్త పట్టాభిషేకం జరిగిన తర్వాత చెప్పుదామనే కదా! మీ రఘువంశంలో ఇంత వరకూ పెద్ద కొడుకే రాజవుతున్నాడు. పిచ్చిదానా! రాముడు భరతుడికెందుకు రాజ్యమిస్తాడు? రాముడి తర్వాత రాముడి కొడుకులు రాజులవుతారు. అప్పుడు అయోధ్యా నగరమంతా రాముడి కొడుకులే రాజ్యానికి రావాలంటుంది. అంతా అంతే, అదే సబబు అంటారు. వసిష్ఠుల వారు అదే ధర్మం, ఆచారం అంటారు. ఇక నీవూ నీ కొడుకూ అడవులు పట్టిపోవాల్సిందే. రేపు కౌసల్యమ్మ చక్రవర్తి తల్లి. సుమిత్రనామె బాగానే చూస్తుంది. నీ తలరాత నెవరూ తప్పించలేరు. నీవూ నీ కొడుకూ ఇక్ష్వాకు మహారాజుకి ఊడిగం చెయ్యండి. నీ మనవలూ అలా దాసులుగా ఉండవలసిందే. రాముడు భరతుడికి రాజ్యం ఇవ్వడు. ఇవ్వాలను

కున్నా అట్లా జరగదు. అతడి కొడుకులు ఊరుకోరు. జ్యేష్ఠానుక్రమం తప్పించటం ఎవరి తరమూ కాదు. నేననకూడదు కాని రాజుగారు చిర కాలం జీవించకపోతే నీ ముద్దు మురిపాలు, నీ సౌభాగ్యం ఇలానే ఉంటాయా? నీవు భ్రమలో ఉన్నావు గాని అలా జరగదు."

"అయితే, ఇంతకూ నీవు ఏమంటావు మంథరా?"

"అట్లా దారిలోకిరా! నీ తండ్రికిచ్చిన వాగ్దానాన్ని ముసలి రాజు ఎలాగూ భంగం చేశాడు. ఇప్పుడు నీవు చేయగలిగింది ఏమీలేదు. కాని నీకిచ్చిన వాగ్దానమైనా నిలుపుకో. ఇక్ష్వాకు రాజులు ఆడితప్పని వారని గొప్పగా బడాయిగా చెప్పుకుంటూ ఉంటారు. చాటుకుంటూ ఉంటారు. దశరథుడు వెనక నీకు రెండువరాలు ఇచ్చాడు - నీవాయనను రక్షించా వన్న ప్రేమతో, అభిమానంతో. ఇప్పుడా రెండు వరాలు పుచ్చుకో. ఒకటి భరతుడికి పట్టం. రెండు రాముడికి పద్నాలుగేళ్ళు వనవాసం."

"ఇంత కఠినంగా నేను కోరగలనా?"

"ఇందులో కఠినమేముంది? పద్నాలుగేళ్ళలో భరతుడు అయోధ్య ప్రజలకు ఇష్టుడవుతాడు. ప్రజలు అతడినే కోరుకుంటారు రాజుగా. రాముడు ఇక్కడే ఉంటే, లేదా ఈ చాయల ఉంటే దశరథమహారాజు ఆయన మంత్రులూ పురప్రముఖులూ భరతుడిపై కారాలు మిరియాలు నూరుతూ కుట్ర పన్నవచ్చు."

"ఏమో అడిగి చూస్తాను!"

"అట్లా నీళ్ళు నమలటంకాదు. ఖండితంగా అడగాలి. లేదంటే రఘు వంశానికి పెద్ద కళంకం వచ్చి తీరుతుందని నిగ్గదీయాలి. బెది రించాలి. అమ్మ శక్తిలా తలవిరబోసుకొని గైయ్యమంటూ రాజుగారిని వేధించాలి. నీ మంచికే చెపుతున్నాను. కౌసల్య ఆట అప్పటికికాని కట్టదు. నా అనుమానం అసలిదంతా కౌసల్యే నూరిపోసిందేమోనని, నీకు తెలుసో తెలీదో ఆరునెలల నుంచీ ఈ అన్ని ప్రయత్నాలు సాగా

యని నాకు తెలిసింది. రాజుగారి మనసులో ఏదో దురాలోచన లేకపోతే పదిరోజులముందే కబురుచేస్తే మన పిల్లవాడు వచ్చేవాడుకాదా! భరతుడికి అసలు కబురే లేదే! నీకింతవరకు చెప్పకపోవటమేమిటి? కాబట్టి నా మాట విను. విను. విను. విను. రాజుగారితో అను. నాకు ఆ రెండు వరాలు యిమ్మను. విన్నావటమ్మా కైకా!"

* * *

అయోధ్యా వాసులందరికీ ప్రతి రోజూ నిండు చంద్రుడిలా సంతోషాన్నిచ్చే శ్రీరామచంద్రుడు భయంకరమైన వన్యమృగ సంచార వాసమైన అడవిలో ఇట్లా ఉన్నాడు కదా అని చిత్రకూటంలో దూరంగా రాముణ్ణి చూడగానే భరతుడు కన్నీరాపుకోలేకపోయినాడు. చీని చీనాంబరాలు ధరించే శ్రీరామచంద్రుడు నారచీరలు కట్టుకున్నాడు. విమల విచిత్రసౌరభవాసితమైన పూలమాలలు ధరించేవాడు జడలు గట్టిన సంస్కారహీనమైన కేశపాశంతో కనపడుతున్నాడు. మంచి గంధం నిరంతరం పూసుకోవాల్సిన శరీరం వొట్టినేలను పండుకోవటం వల్ల మట్టి అంటుకుంటుందికదా దానికి. ఎండకన్నెరుగని రాముడికి ఘోరవనవాసమా? ఇదంతా నావల్ల సంభవించిందికదా! ఇక నా బతుకు ఎంత దుర్యశం పాలవుతుందో కదా అని ఎంతో కుమిలిపోయాడు భరతుడు.

దగ్గరగా వచ్చి భరతశత్రుఘ్నులు అచేతనులై పోయినట్లు రాముడి ముందు పడిపోయినారు. భరతుణ్ణి లేవదీసి గుచ్చి కౌగలించుకున్నాడు. శత్రుఘ్నుణ్ణి కూడా ప్రేమతో ఎదకు హత్తుకున్నాడు రాముడు. తర్వాత బుజంమీద చేయివేసి లాలనగా దగ్గరకు తీసుకున్నాడు భరతుణ్ణి రాముడు. అన్నా అన్నా అనటమేకాని మరిమాటాడలేకపోయినాడు భరతుడు. ఆ వెనకనే వచ్చిన గుహుడు, సుమంత్రుడు కన్పించారు రాముడికి. రామచంద్రుడు ఆశ్చర్యపోయినాడు. అప్పుడిక భరతుణ్ణి తేరిపార చూశాడు. ఏమాత్రమూ ఆనవాలు పట్టలేకుండా

ఉన్నాడు భరతుడు. అప్పుడు ఒక్కసారి తెలుసుకున్నాడు రాముడు. భరతుడు కూడా నారచీరలు కట్టుకొని ఉన్నాడు. అతడి తలకూడా జడలుకట్టి ఉంది. ఎన్నోరోజుల నుంచి ఉపవాసదీక్ష వహించి ఉన్నట్లు చాలా కృశించి ఉన్నాడు భరతుడు. అతిదుఃఖితుడై ఉన్నాడు. రాముడి కిదంతా చాలా ఆశ్చర్యంగా ఉంది.

"నాయనగారిని విడిచి వంటరిగా ఎందుకు వచ్చావు నాయనా? ఆయనసలే వృద్ధులు కదా! మీరిద్దరున్నూ ఆయనను విడిచిరావటం ఏంబాగుంది?" అన్నాడు రాముడు నొచ్చుకుంటూ. "నా మనసు పరిపరి విధాల పోతున్నది. ఎన్నోదుర్నిమిత్తాలు కలచివేస్తున్నాయి మనస్సును. శంకలతో కొట్టుమిట్టాడుతున్నది హృదయం" అని సూటిగా భరతుణ్ణి ప్రశ్నించలేక రాజ ధర్మాన్ని గురించి, ప్రజలపట్ల రాజు నడచుకోవల సిన తీరుగురించి రాముడు భరతుడికి హితబోధ చేశాడు.

అప్పుడు భరతుడన్నాడు:

"మీరిప్పుడు చెప్పిన నృపధర్మాలన్నీ ధార్మికులకుగాని అత్యంత ధర్మ విహీనుడి నైన నాకెందుకు బోధిస్తారు? మన వంశ ధర్మం నీకు తెలియదా అన్నా! నీవు పాలించవలసిన, భరించవలసిన ఈ సామ్రా జ్యాన్ని అధర్మంగా నాకు కట్టబెట్టింది మా అమ్మ. నీవిప్పుడు వెంటనే అయోధ్యకు రాకపోతే మన రాజ్యం కల్లోలమై పోతుంది. సీతాలక్ష్మణ సమేతంగా నీ వెప్పుడు అడవికి బయలుదేరావో అప్పుడే ఆ వెంటనే దశరథ మహారాజు స్వర్గలోకానికి తరలిపోయినారు. నేను అయోధ్య చేరకముందే ఆ పని జరిగిపోయింది. నీ వియోగాన్ని మన తండ్రి ఎలా భరించగలరనుకున్నావు అన్నా?" అని ఆక్రోశించాడు భరతుడు.

ఈ మాటలు వినటంతోటే శ్రీరాముడు దుఃఖోపహతుడైనాడు. ఎంతోసేపు మాట్లాడలేకపోయినాడు. నిట్టూర్పులు వదులుతూ కన్నుల నీరునించాడు. మనస్సు చిక్కపట్టుకోలేక తండ్రిని గూర్చి పనవి పనవి దుఃఖించాడు. జానకివైపు చూసి "విన్నావు కదా! నీ మామ ఇకలేదు. మనమంతా తండ్రిలేని బిడ్డలమైనాము. ఇక అయోధ్యతో నాకేం పని!

నా తండ్రి పలుకులు వినలేని నా దురదృష్టం ఎట్లా తీరుతుంది!" అని తమ్ముళ్ళను కౌగలించుకొని దుఃఖించాడు రాముడు. "నేను పెద్దవాడిగా పుట్టిన నా కర్తవ్యం, నా ధర్మం నెరవేర్చుకోలేకపోయాను. ఇప్పుడైనా తండ్రికి తర్పణం విడుస్తాను" అంటూ సుమంత్రుడు ఓదార్పు మాటలు చెపుతుండగా మందాకినీ తీరానికి నడిచాడు రాముడు. అక్కడ గంగా తీరంలో చక్రవర్తి తనూజుడూ సార్వభౌముడూ అయిన రాముడు ఇంగుదీఫలాలను పిండ ప్రదానం చేయటం చూసి కౌసల్య ఎంతో దుఃఖించింది. జనకనందిని పరమసుకుమారి దశరథమహారాజు కోడలు ఈ విధంగా అరణ్యవాసం చేస్తున్నది కదా అని కౌసల్య దుఃఖం ఆపుకోలేక పోయింది. కైక నోటమాట ఏమీరాక దూరంగా బిక్కు బిక్కుమంటూ ఉండిపోయింది.

మళ్ళీ రామలక్ష్మణులు పర్ణశాలకు చేరుకున్న తర్వాత భరతుడు రాముణ్ణి మిక్కిలి వినయంగా ప్రార్థించాడు. "నేను నీ దాసుణ్ణి. నన్ను గ్రహించవలసింది. దుష్ట చిత్తురాలైన నా తల్లి వల్ల నా జీవితం నిరర్థకమై పోయింది. దశరథమహారాజు పుత్రుడినై ఉండీ వసిష్ఠుల వారిని సేవించుకొని విద్యా బుద్ధులు గ్రహించీ శ్రీరామచంద్రుడికి తమ్ముడినై ఉండీ ఇక్ష్వాకు వంశంలో జన్మించి ఉండీ పాపచారి అయిన నా తల్లి వల్ల నేను అందరికీ దూరమైపోయాను. అనుమానితుడినై పోయినాను. పాప భాజనుడినైనాను. మా తల్లి కౌసల్య నన్ను అనుమానించింది. గుహుడు అనుమానంతో చూశాడు. భరద్వాజ మహర్షి సందేహించాడు. లక్ష్మణుడు అనుమానించాడు. నాకన్నా దురదృష్టవంతుడెవరైనా ఉంటాడా అన్నయ్యా? నేను అయోధ్యలో ఎవరి మొహమూ చూడలేకుండా ఉన్నాను. నా మొహం ఎవరికీ చూపలేకుండా ఉన్నాను.

"మనువు నిర్మించిన నగరం మనది. సమస్త సంపద్భరితము. పరమ సుందరమైనది. నీవులేని రాజ్యం నాకువద్దు, నీవు పరిపాలించని రాజ్యంలో నేను ఉండలేను. నేను కేకయ రాజ్యం నుంచి వచ్చినప్పటి

నుంచీ రాజపరివారంగాని మిత్రులుగాని ఎవరైనా నన్ను చూస్తే నా ముఖం ఎక్కడ దాచుకునేది అని నేను పూర్తిగా ఏకాంతంలోనే గడుపుతున్నాను. ఇప్పుడు సమస్త అయోధ్య నగరమూ ఇక్కడికి కదిలి వచ్చింది. నీవు వెంటనే మాతో కదిలివచ్చి సింహాసనం స్వీకరించ వలసింది మహాప్రభూ!" అని భరతుడు పరిపరి విధాల అన్నగారిని ప్రాధేయ పడ్డాడు.

రాముడు దీర్ఘంగా నిట్టూర్చాడు. "నాయనా, తమ్ముడా! నీవు చెప్పింది బాగానే ఉంది. కాని నాకు సమ్మతమెట్లా అవుతుంది? నాయన గారికి నేను మాట ఇచ్చాను కదా! నేను ఆయనకు వశుణ్ణి, అధీనుణ్ణి కదా! ఒకసారి మాట ఇచ్చిన తర్వాత ఎట్లా తప్పుతానయ్యా! నీ తప్పేమీ లేదు. మన తల్లి కైకమ్మను నిష్కారణంగా నిందించనూ వద్దు. ఆమె ఘోరమైన తప్పు ఏమి చేసింది? కాబట్టి వెంటనే నీ పరివారంతో అయోధ్య నగరానికి వెళ్ళవలసింది" అని బుజ్జగించి చెప్పాడు భరతుడికి రాముడు. ఆ మాటలు విన్న తరువాత భరతుడు మరింత శోకవ్యాకులచిత్తుడైనాడు. "మా తల్లి కైకవల్లకదా రఘువంశానికి ఇటువంటి హాని సంభవించింది. ఆమెను వధించినా పాపం లేదు. అయితే అటువంటి క్రూరకర్మకు నేను పూనుకుంటే నీవు నా ముఖంకూడా చూడవనే నా కోపాన్ని, దుఃఖాన్ని కూడా దిగమింగుకొని నిన్ను యాచించటానికి వచ్చాను అన్నా! నీవురాకపోతే నేను కూడా జటా వల్కలాలు ధరించి ఈ అడవిలోనే ఉండిపోతాను అన్నా!" అన్నాడు భరతుడు.

"నాయనా, నేను అయోధ్య నగరానికి అసలు రాను అనటంలేదే! తండ్రిగారికిచ్చిన మాటకు కట్టుబడి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేసి అప్పుడు తప్పకుండా వస్తాను" అన్నాడు రాముడు.

అప్పుడు వసిష్ఠులవారు కూడా "ఇందులో ధర్మవ్యతిక్రమం ఏమీ లేదు, రామచంద్రా! రాజ్యం అంగీకరించవలసింది" అని చెప్పారు.

"మీరు కూడా ఈ విధంగా నన్ను నిర్బంధించవద్దు. నా తల్లి కైకమ్మ రాజశుల్క అనే విషయం మీకు తెలుసు. అందువల్ల నా తండ్రికి నేను మిక్కిలి విధేయతతో ఇచ్చిన మాటను ఇప్పుడు జవదాట లేను. కులధర్మమూ రాజధర్మమూ నేను అతిక్రమించలేను" అని దృఢంగా చెప్పాడు రాఘవుడు.

అప్పుడిక భరతుడు గత్యంతరంలేక "తండ్రిగారి అభిమతం నిర్వహించటమే కదా కావల్సింది నీకు అన్నా? నీ ప్రతినిధిగా పద్నాలుగేళ్ళు నేను అరణ్యవాసం చేస్తాను. నాది ఈ రాజ్యం అని నీవు చెపుతున్నావు కాబట్టి నా ప్రతినిధిగా నీవు రాజ్యం పరిపాలించు" అని అనునయంగా ఎంతో వేడుకున్నాడు. రాముడు చాలా ఆశ్చర్యపోయినాడు. ఇప్పుడు ఈ విషమ ఘట్టాన్ని ఎట్లా పరిష్కరించడమా అని గాఢంగా ఆలోచించాడు. అప్పుడు భవిష్యద్దర్శనులైన మహర్షులు కొందరు "రాముడు నీకు తండ్రి వంటివాడు, తండ్రిమాట జవదాట కూడదు. కాబట్టి ఆయన చెప్పినట్లు వినవలసిందే" అని భరతుడికి చెప్పారు.

"సరే! ఇప్పుడిక నీకు విధేయుడినై మారుమాటకుండా నీవు చెప్పినట్లే వింటాను. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా చెపుతున్నాను. నీ పాదుకలు తీసుకొని వెళ్ళి ఈ కోసల రాజ్యాన్ని వాటియందే అర్పితంచేసి రాజకార్యాలు నిర్వహిస్తాను. నేను కూడా జడలు దాల్చి నారవస్త్రాలు మాత్రమే ధరించి ఈ పద్నాలుగేళ్లూ గడపుతాను. కందమూలాలు మాత్రమే తింటూ దేహధారణ చేస్తాను. నీ వెప్పుడు వస్తావా అని ఎదురు చూస్తూ కాలం గడుపుతాను" అన్నాడు భరతుడు.

భరతుడు అటుతర్వాత అయోధ్య వెళ్ళలేదు. అయోధ్యా నగరంలో రాజ్యపాలనం చెయ్యలేదు. నంది గ్రామంలో ఉండి రాజ్య వ్యవహారాలన్నీ సమర్థించుకున్నాడు. జటావల్కలాలే ధరించాడు. వన్యఫలాలే తిని దేహసంరక్షణం చేశాడు. సుకుమారుడు సుఖోచితయవ్వనుడు అయిఉండి కూడా తన మూలంగా ఇక్ష్వాకు వంశానికి అపయశస్సు

కలిగిందనీ, రాముడు అరణ్యానికి వెళ్ళటం తనమూలంగానే జరిగిందనీ భరతుడు చాలా చాలా పరితాపంచెంది సుఖాలన్నీ వదులుకొని కోరికోరి అసౌకర్యాలను, కష్టాలను అనుభవించాడు.

తెల్లవారిన తర్వాత స్నానార్థం సరయూనదికి వెళితే లోకులు 'ఇడుగో ఈయనే భరతుడు. దశరథమహారాజు కుటుంబానికి ఇదుగో ఇతడి వల్లనే ఇటువంటి అనర్థం, ఆపద సంభావించా'యని ఒకరితోఒకరు తనను చూసి, చూపిస్తూ ఎక్కడ చెప్పుకుంటారో అని లజ్జించి భరతుడెప్పుడూ అర్ధరాత్రి సమయానే వెళ్ళి సరయూనదిలో స్నానంచేసి వచ్చేవాడు. పధ్నాలుగు సంవత్సరాలు అయోధ్యలో అడుగుపెట్టనైనా లేదు. రాజభోగాలు ఏమీ అనుభవించనేలేదు. నంది గ్రామంలో ఉన్న భరతుడి కంటె అడవిలో ఉన్న రాముడే ఎక్కువ సుఖపడ్డాడు.

అంతరాంతరాలలో శ్రీరామచంద్రుడికి లక్ష్మణుడిపట్లకన్నా భరతుడి పట్లనే ఎక్కువ ప్రేమ, ప్రీతి ఉన్నాయి. రావణ వధానంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు భరతుడు సర్వ సంపత్సమృద్ధమైన రాజ్యాన్ని రామచంద్రుడికి అప్పగించాడు. భరతుడి రాజ్యపరిపాలన కాలంలో కోశాగారం, కోష్ఠాగారం పదిరెట్లు వృద్ధి చెంది, సంపన్నమైనాయి. సీతాపహరణం సంగతి చారులవల్ల భరతుడు విన్నాడు. అందువల్ల రావణ వధకోసం పదిరెట్లు సైన్యాన్ని పెంచి సమీకరించి ఉంచాడు అయోధ్యలో. అందువల్ల భరతుడి రాజ్యపాలనలో అన్ని రంగాలలో అన్ని విషయాలలో పదింతలు సంపద్భరితమైంది అయోధ్య రాజ్యం.

అటువంటి అయోధ్య రాజ్యానికి సీతాదేవి సమేతంగా పట్టాభిషిక్తుడైనాడు శ్రీరామచంద్రుడు. లక్ష్మణస్వామి తనకేమీ ఆసక్తి లేదని చెప్పినందువల్ల శ్రీరాముడు భరతుణ్ణి యువరాజుగా చేశాడు

రాముణ్ణి గురించే ఎప్పుడూ చెప్పుకుంటూ రామరాజ్యంలో ప్రజలు సుఖించారు.

(ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం అనుబంధం-1984)